# తెగని బంధాలు




"పోస్ట్!"

ఒళ్ళో వున్న బాబుని క్రిందకి దింపి వెళ్ళి కవరు అందుకుంది లలిత.

"ఎక్కడినించి?" పేపరు చదువుతున్న ప్రభాకర్ తలెత్తి చూశాడు.

"మీ నాన్నగారు వ్రాశారనుకుంటాను" అంటూ కవరు అందించింది లలిత.

చిరంజీవి కుమారుడికి, తండ్రి ఆశీర్వదించి వ్రాయునది. ఇక్కడంతా క్షేమం. ఈ మధ్య నీ దగ్గరనించి ఉత్తరాలు లేవు. నువ్వు క్రితం నెల ఏమీ పంపలేదు. చిన్నాడికి టరమ్ ఫీజు కట్టాలి. మీ అమ్మ ఒకసారి కాకినాడ వెళ్ళి మీ మామయ్యని చూసివస్తానంటోంది. కాబట్టి ఈ నెల కొంత ఎక్కువగా పంపుతే బాగుంటుంది. విశేషాలు లేవు. డబ్బుమాత్రం వెంటనే పంపాలి.

చిరంజీవి సౌభాగ్యవతి లలిత, చిరంజీవి బాబు కులాసాగ ఉన్నసంగతి వ్రాయించవలెను. నీ ఆరోగ్యం జాగ్రత్త.

నీ తండ్రి

ఉత్తరాన్ని చదువుకుని టేబులుపైన పడేశాడు ప్రభాకర్.

"మామగారి దగ్గరనించేనా?"

"ఊఁ"

"ఏం రాశారు?"

"నువ్వే చదువు"

"మీరు చెప్పండి ఏం రాశారో? డబ్బు పంపమని వ్రాసిఉంటారు. అంతేనా?"

"ఎంత పంపిద్దామంటావు?"

"నన్నడగటం దేనికి?" ముఖం పగం మాడ్చుకుని అంది లలిత.

"అంతే?" లలిత ముఖంలోకే చూస్తూ అన్నాడు ప్రభాకర్.

"మీకు తోచినట్లు చేయండి."

"అదికాదు లలితా! క్రితం నెలకూడా ఏమీ పంపలేదుగదా?"

"అందుకే మీకుతోచినట్లు చేయమంటున్నాను గదా!"

"అసేమిటి నీ ఉద్దేశం చెప్పు."

"నా ఉద్దేశాలు, నా మాటలు వింటారా పెద్దారా?"


"ఎప్పుడు వినలేదో చెప్పు. నువ్వు చెప్పినట్లే చేస్తున్నానుగదా!"

"అయితే మీరేమీ పంపవలసిన పనిలేదు." చిన్నగా నవ్వుతూ తలెత్తి చూసింది లలిత.

"క్రితం నెలకూడా ఏమీపంపలేదు." నెమ్మదిగా అన్నాడు లలితవంకే చూస్తూ.

"అయినా క్రితంనెల గడిచింది, అట్లాగే ఈ నెలా గడుస్తుంది."

"తమ్ముడికి టరమ్‌ఫీ కట్టాలిట. అమ్మ కాకినాడ వెళ్దామనుకుంటున్నదట."




# తెగని బంధాలు

"అన్నీ సరిపోతాయండీ! క్రితం నెల గడవ లేదా!"

"ఇబ్బందిపడతారేమో లలితా?"

"అది మీ పిచ్చిభ్రమ! అయినా వాళ్ళకి వచ్చేది సరిపోదా ఏమిటి? ఇంటి అద్దెలేదు. స్వంత ఇల్లేవుందికదా! ఒకభాగం అద్దెకికూడా ఇచ్చారు. ఆ అద్దెని వాళ్ళే వాడుకుంటారుగదా! దానికితోడు మామగారికి పింఛనుకూడా వస్తుంది. ఇంకా సరిపోకపోవడ మేమిటండీ!"

"అంతాకలిపి ఎంతవుతుంది లలితా! ఈ రోజుల్లో..."

"అదేమిటండీ అట్లాఅంటారు! ఆ బందరులో ఖర్చేమివుంటుంది? అన్నీ చవకేగా! అదేమైనా ఈ వూరిలా మహాపట్టణమా ఏమిటి?"

"ఎంత మహాపట్టణం కాకపోయినా, ఖర్చు వుండదా? అవసరం లేకపోతే ఎందుకు వ్రాస్తారు చెప్పు."

"అవసరానికి అంటేమిటండీ? మీరు పంపుతున్నారు కాబట్టి వాళ్ళు రాస్తున్నారు. అంతేగాని గడవకకాదు. క్రితంనెల గడవలేదా?"

"................"

"ఇదివరకూ మీరొక్కరే వుండేవారుకాబట్టి. అప్పుడు పంపడంలో అర్ధంవుంది. ఇప్పుడు మీకు సంసారంఅంటూ ఏర్పడిందికదా!"

"అది నిజమేఅనుకో! అయినా మనకి ఎనిమిది వందలు వస్తాయి. ఓ నూటయాభై పంపితే మనకి ఇబ్బంది ఏముంటుంది?"

"నూటయాభై అంటే మీకంత తేలిగ్గావుంది! అది ఏబ్యాంకులోనో వేస్తే ముందుముందు ఎంత ఉపకరిస్తుందో మీరు గ్రహించటం లేదు."

"——————"

"అదికాకుండా. ఇప్పుడు మనిద్దరమేకాదు. ఈ బాబుకూడా వున్నాడు. వీడిభవిష్యత్తు గురించి కూడ ఆలోచించాలిగదా? తీరా వీడు పైకివచ్చినప్పుడు చేతిలో డబ్బులేకపోతే ఎట్లాగండీ? మీలానే వీడుకూడ ఏ పెద్ద ఇంజినీరో, డాక్టరో అవాలిగదా!"

"ఇంకా చాలారోజుల మాటగదా లలితా!"

"అయితేమాత్రం? ఇప్పటినుంచీ వెనకేస్తేనే అప్పటికి వుంటుంది. అప్పుడు హఠాత్తుగా ఎక్కడనించి వస్తుంది చెప్పండి. రోజులు గడుస్తుంటే ఇంకోఇద్దరు బయలుదేర్తారు. వాళ్ళ భవిష్యత్తు కూడ మనమే చూసుకోవాలిగదా?"

"అవుననుకో!"

"ఉన్నప్పుడే నాలుగురాళ్ళు వెనకేసుకోవాలండీ. లేకపోతే ముందు చాలా ఇబ్బంది పడిపోతాము. పిల్లల్ని వృద్ధిలోకి తీసుకురావలసిన బాధ్యత మనమీద వుంది."

"ఇంతకీ ఇప్పుడేమి చేయమంటావో చెప్పు."

"ఏమీలేదు. మాట్లాకుండా వూరుకోండి."

"సమాధానం వ్రాయవద్దా?"

"తప్పకుండా వ్రాయండి. అంతా కులాసాగా వున్నారని వ్రాయండి. నేను, బాబు ఆరోగ్యంగా వున్నామని వ్రాయండి."

డబ్బు విషయం?"

"ఏవో ఇబ్బందులవల్ల ఈ నెలకూడా పంపలేకపోతున్నానని వ్రాయండి."

"సరే" అంటూ కాగితం, పెన్ను అందుకున్నాడు ప్రభాకర్.

* * *

కొడుకు రాసిన ఉత్తరంచూసి ఆలోచిస్తూ కూర్చున్నాడు రామనాథంగారు. ప్రభాకర్ వ్రాసిన వుత్తరం చేతిలో గాలికి రెపరెపలాడ్తోంది.

క్రిందటినెల పంపలేదు. ఈ నెలకూడా పంపడంలేదని రాశాడు. చిన్నాడికి టరమ్ ఫీ కట్టాలి. వంద రూపాయలు ఎక్కడనించి వస్తాయి? పెద్దాడిమీద వుండే నమ్మకంతో చిన్నాడిని బి. ఎ. లో చేర్పించాడు, ఒక సంవత్సరం అయిపోయింది. ఈ ఏడుకూడా గడిచిపోతే ఆ పట్టా చేతికొస్తుంది. ఈ రోజుల్లో బి. ఎ. వరకేనా చదవకపోతే లాభంలేదు. పెద్దాడిని ఇంజినీరింగు చదివించేటప్పటికే తల ప్రాణం తోకకొచ్చింది. చిన్నాడి విషయంలో పెద్దాడు సహాయం చేస్తాడుకదా అనుకున్నాడు. అనుకున్నట్లుగానే ఇంతవరకూ చేస్తూవచ్చాడు. కాని...

ఆలోచిస్తూ కూర్చున్న రామనాథంగారు చిన్నకొడుకు రామం పిలుపుతో తలెత్తి చూశాడు.

"అన్నయ్య డబ్బుపంపాడా నాన్నా?"

సమాధానంగా చేతిలోని ఉత్తరం అందిచ్చాడు రామనాథంగారు. "నీ టరమ్ ఫీ ఎప్పుడు కట్టాలిరా?"

"నాలుగు రోజుల్లో కట్టాలి."

"ఏమిచేద్దామంటావ్?"

"చేసేదేముంది నాన్నా, చదువు మానేస్తాను"

"అదేమిటి నీ ముఖం! చదువు మానడమేమిట్రా? ఎక్కడో అక్కడ తీసికొచ్చి కడ్దాము."

"ఈ ఒక్క టరమ్ కడ్తే అవుతుందా? ఇంకా రెండు టరమ్ ఫీలు కట్టాలి."

"దాందేముందిరా! ఏదో ఈ నెలా క్రిందటి నెలా ఇబ్బందుల్లోనుండి పంపలేదేమో! అంతే కాని వాడికిమాత్రం ఇక్కడి పరిస్థితి తెలియదా ఏమిటి? ఎక్కడి నించేనా తీసికొచ్చి ఇస్తాను, టరం ఫీ కట్టెయ్. పెద్దాడి దగ్గరనించి డబ్బు వచ్చిం తర్వాత ఇచ్చేద్దాము.

"నీ ఇష్టం నాన్నా! నాకుమాత్రం నమ్మకం లేదు" అంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాడు రామం.

కాని పెద్దకొడుకుమీద తనకి నమ్మకం వుంది. వాడి చదువుకి తను ఎంత కష్టపడ్డాడో వాడికి తెలియదా! చిన్నాడిచదువు బాధ్యత పెద్దాడిమీద వేయడంలో తప్పేముంది? అసలు వాడే అన్నాడుకదా, "తమ్ముడి విషయం నాకు వదిలేయి నాన్నా! వాడు ఎం. ఎ. వరకు చదవాలి. ప్రతిక్లాసులో ఫస్టు వస్తున్నాడు, ఎం.ఎ.లో కూడా ఫస్టు వస్తాడు" అంటూ ఏదో ఇబ్బందుల్లో వుండి రెండునెలలు పంపనంతమాత్రంలోనే నమ్మకంపోతే ఎట్లా?

కాని మూడోనెలలోకూడా ప్రభాకర్ దగ్గర నించి డబ్బేమీ రాకపోయేటప్పటికి. తను తలచింది నిజంకాదని తెలుసుకున్నాడు రామనాథంగారు.

"ఏరా అబ్బాయ్! పెద్దాడు ఈ నెలకూడా పంపలేదే?" అన్నాడు చిన్నకొడుకుతో ఓ రోజు.

పేలవంగా నవ్వాడు రామం. "నేను ముందే చెప్పానుగదా నాన్నా! ఇకపైన అన్నయ్య పంపడు."

"మరి ఏం చేద్దామంటావ్? పోనీ నువ్వో ఉత్తరం రాయలేకపోయావా?"

"ఒద్దునాన్నా! అన్నయ్యకి ఇక్కడి పరిస్థితులు తెలియవా ఉత్తరం రాయడానికి?"

"మరేం చేద్దాం?"

"చదువు మానేస్తాను."

"మానేసి?"

"ఉద్యోగంలో చేర్తాను."

"పిడిశావ్! ఫుడీకి చదువు మానేస్తానంటావ్ మానేసి ఏంచేస్తావ్! నాలాగే గుమాస్తాగిరీ వెలగబెడ్తానంటావ్, అంతేనా?" కాస్త కోపంగా అన్నాడు రామనాథంగారు.

"అంతకంటె చేసేదేముందినాన్నా? అన్నయ్య పంపేడబ్బుతప్ప మరో దారేముంది?"

"ఏదోదారి చూద్దాము. అంతేగాని నీ చదువు ఆగడానికి వీల్లేదు. రేపు ఫస్టువరకూ చూసి అప్పుడు ఆలోచిద్దాం."

ఆ ఫస్టు కూడా వచ్చింది, వెళ్ళింది. ప్రభాకర్ దగ్గరనించి డబ్బురాలేదు సరికదా, కనీసం ఉత్తరంకూడా లేదు.

ఒక నిట్టూర్పువిడిచాడు రామనాథంగారు. చిన్నాడుచెప్పినట్టు ఇకపైన పెద్దాడిదగ్గరనించి డబ్బు ఆశించడం అనవసరం. వాడు పంపడు. డబ్బుకోసం తను వ్రాయాలేదు. పరిస్థితులు తెలియనివాడైతే వ్రాయవచ్చు. తెలిసుండీ అట్లా ప్రవర్తిస్తూంటే తను చేసేదేముంది? కొడుక్కి అయినాసరే, డబ్బుకోసం లేకిగా వ్రాయడం అనేది తనవల్లకాదు.

ఈ నాలుగునెలలు ఇల్లుగడవటమే బ్రహ్మప్రళయం అయింది. దానికితోడు చిన్నాడి చదువు. కనీసం బి. ఎ. అయినా పూర్తయేటట్లు చూస్తే, తరువాత విషయం తరువాత చూసుకోవచ్చు.

అందుకు మిగిలినదారి ఒక్కటే! తను మళ్ళీ ఉద్యోగంలో చేరాలి. ఈ వయస్సులో ఉద్యోగం చేయడం కష్టమే. ఆ విషయం తనకి తెలుసు. కాని తప్పనప్పుడు చేసేదేముంది! తను కష్టపడి పెద్దవాడిని వృద్ధిలోకి తీసుకువచ్చాడు. చిన్నవాడికోసం కూడ కష్టపడటం తన విధి.

* * *

ఎనిమిది నెలలు గడిచాయి. ఈ ఎనిమిది నెలల్లో ప్రభాకర్ దగ్గరనించి పైసకూడా రాలేదు. పంపమని రామనాథంగారుకూడా మళ్ళీ వ్రాయలేదు. డబ్బుగురించి వ్రాయకపోయినా, వారానికో ఉత్తరమేనా తప్పక వ్రాసేవాడు రామనాథంగారు. మూడునాలుగు వుత్తరాలకి ఒక జవాబువచ్చేది ప్రభాకర్‌దగ్గరనించి.

జనవరి నెల వచ్చింది, సంక్రాంతి పండగకి, లలిత బాబుతోసహా తప్పక రమ్మనమని వ్రాశాడు



ఎవడ్రా నా తోక తొక్కింది?  ఫొటో: డి. జె. రాజు, మహబూబ్‌నగర్

రామనాథంగారు. పండక్కి మామగారి ఇంటికి వెద్దామనుకున్నాడు ప్రభాకర్. కాని మామగారి దగ్గరనించి పిలుపు రాకపోయేటప్పటికి, పోనీ తల్లితండ్రులనయినా చూసివద్దాంఅనుకున్నాడు. లలితనికూడా రమ్మనమని అడుగుతే, "వేసంగి సెలవలకి అందరం వెద్దాము, ఇప్పటికి మీరు వెళ్ళరండి' అంది. రెండురోజుల్లోతిరిగి వచ్చేస్తానని చెప్పి, బందరు బయల్దేరాడు ప్రభాకర్.

గుమ్మంలో అడుగుపెట్టిన కొడుకుని చూసి ఎంతో సంతోషపడింది పద్మావతమ్మగారు. "ఏమిట్రా అబ్బాయ్! అట్లా చిక్కిపోయావు" అంటూ దగ్గరగావచ్చి కొడుకు ఒళ్ళంతా తడిమింది ఆప్యాయతతో.

"చిక్కడం ఏమిటమ్మా" అంటూ నవ్వాడు ప్రభాకర్. "నీకు అట్లా కనబడుతున్నానంతే."

"నీ ముఖం! ఎట్లాచిక్కి శల్యమైపోయావో చూడు." అంటూ ఇన్ని మిరపకాయలు, ఉప్పు దిగతుడిచి నిప్పులోవేసింది. "అదీ సంగతి! ఎవరిదో దిష్టితగిలింది! చూశావా పేలటమేలేదు?"

"నాకు దిష్టేమిటమ్మా" అంటూ నవ్వాడు ప్రభాకర్. "నాన్నగారు ఏరీ?"

"కొద్దిసేపట్లో వస్తారు. స్నానంచేస్తావా? వేడి నీళ్ళు పెట్టనా?"

"ఇప్పుడేమీ వద్దమ్మా! తమ్ముడేడీ?"

"కాలేజీనుంచి ఇంకా రాలేదులాగుంది. ఉండు కాస్త కాఫీయేనా పెట్టి ఇస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది పద్మావతమ్మగారు.

తల్లివెనకే వెళ్ళి ఒక పీటవాల్చుకుని కూర్చున్నాడు ప్రభాకర్. "అమ్మా! నీ ఆరోగ్యం బాగా వుంటున్నదా? నాన్నగారి ఆరోగ్యం బాగా వుందిగదా?"

"ఫరవా లేదురా నాయనా, బాగానే వున్నాము."

"తమ్ముడు బాగా చదువుతున్నాడా?"

"ఏమి చదువో ఏమిటో నాకేమీ అర్థం కావటంలేదురా అబ్బాయ్! ఇదివరకు రాత్రి పదకొండు అయితేగాని పడుకునేవాడుకాదు. అట్లాంటిది, ఇప్పుడు ఎనిమిది అవకుండానే నిద్రపోతున్నాడు. వాడు పుస్తకం తెరవగాచూసి రెండు నెలలైంది."

"అదేమిటమ్మా రెండో సంవత్సరంకదా, శ్రద్ధగా చదవకపోతే ఎట్లా?"

"ఏమోరా బాబూ! నా కేమి తెలుస్తుంది!"

"అయినా అట్లా అశ్రద్ధ చేసేవాడుకాదే?"

"అదిగో వచ్చాడుగా, నువ్వే కనుక్కో" అంది పద్మావతమ్మగారు, అప్పుడే ఇంట్లోకి అడుగుపెడ్తున్న రామంని చూసి.

రామం ఇంట్లోకి అడుగుపెడ్తూనే, "ఎప్పుడు వచ్చావ్ అన్నయ్యా" అంటూ పలకరించాడు ఆప్యాయతగా.






# తెగని బంధాలు

"ఇప్పుడేరా అంటూ పీటమీదనించి లేచాడు ప్రభాకర్. "కాలేజీ నించేనా?" అంటూ రామంతోబాటు ముందర గదిలోకి వెళ్ళాడు.

"ఇవ్వాళ కాలేజీకి వెళ్ళలేదు అన్నయ్యా!"

"అదేమి?"

"ఏమిటో వెళ్ళబుద్ధికాలేదు."

"అదేమిట్రా! ఆఖరి టరమ్ కదా. ఇప్పుడు శ్రద్ధగా చదవకపోతే ఎట్లా?"

పొడుగు పెరగండి!

'WHEN NATURE FAILS'

ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మా "హైటెక్స్" "Hytex' ఔషధం ఉపయోగిస్తే మీరు గ్యారంటీగా 2 నుంచి 6 అంగుళముల వరకు పొడుగు పెరగగలరు. ఏ వయస్సులో వున్నా ఫరవా లేదు. స్త్రీ పురుషులు పుచ్చుకోవచ్చు. ఒక ఫియల్ వెల (20 Tabs) రూ. 3–75. పోస్టేజి అదనం.

నెరసిన సిరోజాలను పోగొట్టుకోండి

మా నిరపాయకరమైన. సువాసనగల "బాల్ కాలా తేల్" "BAL KALA TEL" తెల్లవెంట్రుకలు శాశ్వతంగా వ్రేళ్ళతోసహా నల్లబడేలా చేస్తుంది. ఒక ఫియల్ వెల రూ. 3-75. పోస్టేజి అదనం. 3 ఫియల్స్ వెల రూ. 7–50.

ఉత్తరములు ఆంగ్లంలో వ్రాయండి.

N. B: Correspondence in English

M/S. UNITED COMMERCIAL Co.

Beat No. 29

(A. W. V. 10) Door No. 3883

AMBALA CANTT. (N. India)

"అట్లా గట్టిగా కేకలేయిరా అబ్బాయ్" అంటూ రెండు కప్పుల కాఫీతో వచ్చింది పద్మావతమ్మగారు. "పాలు చాల్లేదురా అబ్బాయ్. కాఫీ కాస్త షాగ్గింగుగా వుంది" అంటూ కొడుకు లిద్దరికీ చెరొక కప్పుఇచ్చి, మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది.

"ఏమిట్రా రామం కబుర్లు? ఇంతకీ నీ చదువు ఎట్లా వుందంటావ్?"

"చదువు మానేద్దామనుకుంటున్నాను అన్నయ్యా." ఖాళీ కప్పుని క్రింద పెడ్తూ అన్నాడు రామం.

ఆశ్చర్యపోతూ చూశాడు ప్రభాకర్. "అదేమిటి!"

"ఏమిటో చదువుమీద శ్రద్ధ కలగటంలేదు" అంటూ తలొంచుకున్నాడు రామం. "అది కాకుండా నాన్న అట్లా కష్టపడుతుంటే చూడ లేకుండా వున్నాను."

"కష్టపడటమా?" విభ్రాంతిపోయి చూశాడు ప్రభాకర్. "కష్టపడ్డం ఏమిట్రా?"

"నాన్న ఉద్యోగం చేస్తున్నాడు."

"ఉద్యోగమా!" అదిరిపడ్డాడు ప్రభాకర్. "ఉద్యోగం ఏమిట్రా?" అర్థంకానట్లు చూస్తూ అడిగాడు.

'నాలుగు నెలలనించి మార్వాడీ షాపులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. నెలకి ఎనభై రూపాయలు ఇస్తారుట."

అవాక్కయిపోయి అట్లాగేచూస్తూ కూర్చు న్నాడు ప్రభాకర్.

"ఏమిట్రా రామం! ఈ వయస్సులో ఆయన ఉద్యోగం చేయడమేమిటి? అంత అవసరం ఏమొచ్చింది?"

"ఇంట్లో గడవటంలేదు అన్నయ్యా."

"గడవటంలేదా!" ఆశ్చర్యపోతూ చూశాడు.

"ఏమి అద్దెకున్నవాళ్ళు అద్దె ఇవ్వడంలేదా? నాన్నగారి పించను రావడంలేదా?"

అదోలా నవ్వాడు రామం. "అద్దె నలభై రూపాయలు వస్తూనే వున్నాయి. నాన్నగారి పించను నలభై రూపాయలుకూడా వస్తూనేవుంది. కాని ఎనభై రూపాయల్తో ఎట్లా గడుస్తుంది. అన్నయ్యా? దానికితోడు నా చదువొకటి! అది కూడా చిన్నక్లాసు కాదు."

ప్రభాకర్‌కి ఎవరో చెంపమీద ఛెళ్ళున కొట్టి నట్లు అయింది. నిజమే! ఈ రోజుల్లో ఎనభై రూపాయల్లో ఎట్లా గడుస్తుంది? ఒక్క మనిషికే సరిపోదే! అట్లాంటిది ముగ్గురుకి ఎట్లా సరి పోతుంది? అంతమాత్రం ఆలోచన తనకెందుకు కలగలేదు?

"అందుకనే చదువు మానేసి, ఏదేనా ఉద్యోగంలో చేరుదామనుకుంటున్నాను. నాన్న ఇట్లా ఉద్యోగం చేయడం నా కిష్టంలేదు. ప్రొద్దున్న ఎనిమిదిగంటలకి వెడ్తే, రాత్రి పదిగంటలకిగాని రాడు. ఇట్లాగే ఇంకో కొన్నిరోజులు పని చేశాడంటే, ఆయన ఆరోగ్యం పూర్తిగా చెడిపోతుంది."

పిచ్చివాడిలా తమ్ముని వంకే చూస్తూ కూర్చు న్నాడు ప్రభాకర్. అవును, చెడిపోతుంది! ఒక్క చెడిపోడమేమి ఖర్మ! ప్రాణమే పోతుంది. రేపు పోయేది, ఇవ్వాళే పోతుంది. ఛీ! తనుకూడ ఒక మనిషేనా?

తల గిఱ్ఱున తిరిగిపోతూంటె, నెమ్మదిగాలేచి రోడ్డుమీదకి వెళ్ళాడు ప్రభాకర్. మెదడు పని చేయటం మానేసింది. ఆలోచనలు పరిపరివిధాల పోవటం మొదలెట్టాయి.

ఐదునెలలనించి డబ్బు విషయం వ్రాయక పోతే, నిజంగానే గడుస్తున్నది అనుకున్నాడు. అంతేగాని ఎనభై రూపాయల్తో ఎట్లా గడుస్తుంది. అనే యోచనాజ్ఞానమే లేకపోయింది. తనకి చదువువుంది! పెద్దచదువే వుంది! కాని ఏమి లాభం? చదువుకున్నవాడికి వుండే వివేకం లేక పోయింది. తనని చదివించడానికి ఆయన ఎంత కష్టపడ్డాడు! తను ఉద్యోగంలోచేరి తండ్రిని సంతోషపెట్టాలి అనుకునేవాడే! ఇదేనా సంతోష పెట్టడం? ఇదేనా తనకోసం రెక్కలు ముక్కలు చేసుకున్న తండ్రికి చూపవలసిన కృతజ్ఞత! తన తండ్రిచేసిన త్యాగంలో ప్రత్యమ్నాయంగా తను చేయవలసింది ఇదేనా! ఇదేనా!—

తలొంచుకుని పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తూ నడుస్తున్న ప్రభాకర్, వెనకగా కారుహారన్ విని ఉలిక్కిపడ్డాడు. ఒకసారి చుట్టూరాచూసి, తను మెయిన్‌బజారులో వున్నట్లు తెలుసుకున్నాడు. మార్వాడీషాపు అక్కడికి దగ్గర్లోనే వుంది.

నెమ్మదిగా అడుగులువేసుకుంటూ అటువైపు వెళ్ళాడు.

రాత్రి ఎనిమిది దాటడంవల్ల బజారంతా పల్చబడిపోయింది, ఒక్కొక్క దుకాణమే మూసే స్తున్నారు.

షాపుదగ్గరకు వెళ్ళిన ప్రభాకర్, అక్కడి దృశ్యం చూసి నిలువెల్లా కంపించిపోయాడు!

బలహీనంగా వెలుగుతున్న లాంతరుని ముందర పెట్టుకుని, బాణంలా ఒంగిపోయిన నడుంతో, తల దాదాపు పుస్తకానికి ఆనేటట్లు వంచుకుని లెక్కలువ్రాస్తున్న తండ్రి కనపడ్డాడు.

తండ్రిని ఆ స్థితిలో చూసిన ప్రభాకర్‌కి మతిపోయింది. కళ్ళలో నీళ్ళు గిఱ్ఱున తిరిగాయి.

తనచదువుకోసం కూడా ఇట్లాగే కష్టపడ్డాడు! అప్పుడుకూడా ఇంతగా కష్టపడే తనని ఇంత పైకి తీసుకువచ్చాడు!

ఛీ! తనుకూడా ఒక మనిషేనా? మృగం! పశువు! అంతకంటె కనాకష్టం! పశువుకి కొంతేనా కృతజ్ఞత వుంటుంది. తనలో అదికూడా లేదు. ఛీ! తన బ్రతుకు కూడ ఒక బ్రతుకేనా!

ఇదంతా ఆది చేసింది. తనకళ్ళు కప్పేసి, దీ పిల్లల భవిష్యత్తు అంటూ నూరిపోసి తనని పెడదారి పట్టించింది.

ఛీ! ఈ స్త్రీజాతిని నమ్మడమేమిటి! ఆడదాని మాటవిని బాగుపడ్డవాడు ఎవడు? తనబుద్ధే గడ్డి తింది. అందుకనే ఆ దయ్యంమాటకి అంత విలువ ఇచ్చుకుంటూ వచ్చాడు——

శిలాప్రతిమలా నిలబడి తండ్రివంకే చూస్తూ నిల్చున్న ప్రభాకర్, "ఎవరు కావాలండీ" అన్న మార్వాడీసేట్ పిలుపుతో ఈ లోకంలో పడి, తండ్రివైపు చూపించాడు. యాంత్రికంగా.

"పంతులా?" అంటూ రామనాథంగారి వైపు చూశాడు మార్వాడీ సేట్. "పంతులూ! నీ కోసం ఎవరో వచ్చారయ్యా."

తన తండ్రిని ఏకవచన ప్రయోగంతో పిలుస్తున్న మార్వాడీ సేట్‌మీద వచ్చిన కోపం అతి కష్టంమీద అణచుకున్నాడు ప్రభాకర్.

"నా కోసమా?" అంటూ తలెత్తాడు రామనాథంగారు. ముక్కుచివరికి జారిపోయిన కళ్ళద్దాలని ఒకసారి సవరించుకుని కళ్ళు చికిలించి చూశాడు.

మరుక్షణంలో "ప్రభా!" అంటూ ఒక్కవుదుటన లేచి నిలబడ్డాడు, సంతోషంతో. మార్వాడీ సేట్ వైపుతిరిగి "మాపెద్దబ్బాయండీ సేట్ జీ" అన్నాడు. మెరుస్తున్న కళ్ళతో.

"ఓహో!"

"హైదరాబాదులో పెద్ద ఇంజనీరుగా పనిచేస్తున్నాడు!"

"అట్లాగా!" అన్నాడు సేట్ నవ్వుతూ.

ఆ నవ్వు ప్రభాకర్ గుండెల్ని పిండేసింది. "ఏడిశాడు! వీడు ఇంజనీరేమిటి! నిజంగా అంత పెద్ద ఇంజనీరయితే, ఇట్లా తండ్రిని ఈ వయస్సులో పని చేయనిస్తాడా?" అన్నట్లుంది ఆ నవ్వు.

"సరె పంతులూ! ఇవ్వాళటికి వెళ్ళిరా. వూరునించి నీ కొడుకు వచ్చినట్లున్నాడు. రేపైనా ఆ ఎకౌంటు పూర్తిచేయాలి."

"మంచిది సేట్ జీ, రేపు ఎంత పొద్దుపోయినా పూర్తిచేసి మరీ వెళ్తాను" అంటూ పుస్తకాలు మూసేసి అలమారలో పెట్టి వచ్చాడు రామనాథంగారు. "పదరా అబ్బాయ్" అంటూ కొడుకు భుజంమీద ఆప్యాయంగా చెయ్యివేసి బయలుదేరాడు.



వయోవృద్ధుడు (నీటిరంగుల చిత్రం)
చిత్రం : వేలూరి రాధాకృష్ణ

"ఏమిట్రా అబ్బాయ్ విశేషాలు? కోడలు, బాబు కులాసాగా వున్నారుకదా? వాళ్ళనికూడా తీసుకువచ్చావా లేదా? పండక్కి వస్తావో రావో అనుకున్నాను. వచ్చావు. చాలా సంతోషం! ఏమిట్రా, చిక్కిపోయినట్లు కనపడుతున్నావేం? ఆరోగ్యం బాగాలేదా ఏమిటి? అందుకనే మీ అమ్మని తీసికెళ్ళరా అన్నాను. నీకు ఎప్పుడేమి కావాలో దానికి బాగా తెలుసు. నువ్వేమో నాకేదో ఇబ్బంది అవుతుందని వద్దన్నావ్! ఇప్పుడుచూడు ఎట్లా చిక్కిపోయావో?"

తండ్రి చూపే ఆప్యాయతని భరించలేకపోయాడు ప్రభాకర్. ఇందాకటినించి అతి కష్టంమీద అణచుకున్న దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికి ఉప్పెనలా వచ్చింది.

కొడుకుని జూసిన సంతోషంలో ఏదో చెప్పబోతున్న రామనాథంగారు ఉలిక్కిపడి కొడుకు వంక చూశాడు. కొడుకు కంటివెంట ధారాపాతంగాకారుతున్న కన్నీటినిచూసిచకితుడయాడు. "ఏమిట్రా అబ్బాయ్! ఏమయింది?" అంటూ ప్రశ్నించాడు గాభరాపడిపోతూ.

నాన్నా...నాన్నా! నన్ను క్షమించు నాన్నా అది...నీ కోడలు."

"ఏమిట్రా ఏమయింది? కోడలు పిల్ల క్షేమమేనా?"

"నీ కోడలు...మాటలు...విని...విని"

"ఏమిట్రా బాబూ! సరిగ్గాచెప్పు! కోడలు మాటేమిటి? వినడమేమిటి?"

"నీ కోడలు మాటవిని ... నీకింతకష్టం కలిగించాను...ఆ దెయ్యం మాటలు నమ్మి...నీకు ఇన్నాళ్ళు డబ్బు పంపలేదు...ఆ రాక్షసి..." దుఃఖంతో గొంతుక పూడిపోయింది ప్రభాకర్‌కి.

కొడుకు ముఖంవంకే చూస్తూ నిలబడ్డ రామనాథంగారికి ప్రభాకర్ చెప్పేదేమిటో అర్థం అయి, బిగ్గరగా నవ్వాడు. "హోరి ఇంతేట్రా! ఏమయిందోనని హడలిపోయాను. అయినా ఆడకూతుర్ని దయ్యం గియ్యం అనవచ్చట్రా! తప్పుకదూ! పిచ్చివాడా, ఏ భార్యా అయినా తన భర్త సంపాదించి తనకీ, తన పిల్లలకిమాత్రమే పెట్టాలనికోరుతుందిరా అబ్బాయ్. అదిలోకసహజం. అంత మాత్రానికే భార్యని దయ్యం, రాక్షసి అంటారుట్రా! ఇంత చదువూ చదివి నేర్చుకుంది ఇదా."

ఇంకా అట్లాగే దుఃఖిస్తున్న కొడుకుని ఈసారి గట్టిగా మందలించాడు. 'ఎందుకురా అట్లా ఏడుస్తావ? నీ కేమైనా మతిపోయిందా? పిచ్చివాడా, మమతలు డబ్బుమీద ఆధారపడి లేవురా! డబ్బు పంపినా పంపకపోయినా నువ్వు నా కొడుకువి కాకపోవు. నేను నీతండ్రిని కాకపోను. కాబట్టి అదే మనస్సులో పెట్టుకుని బాధపడవద్దు.

"లేదు నాన్నా! నా వల్ల పెద్ద పొరపాటు జరిగిపోయింది. క్షమించమని అడగడానికికూడా అర్హుడినికాను. చేయరాని ఘోరాపరాధం చేశాను. ఇప్పుడేనా నువ్వీ ఉద్యోగం మానేయి నాన్నా! నా ఈ ఒక్కతప్పు క్షమించునాన్నా!" రుద్ధపోయిన కంఠంతో బ్రతిమాలుతూ అడిగాడు ప్రభాకర్.

"నువ్వెంత అమాయకుడివిరా అబ్బాయ్" అంటూ నవ్వాడు రామనాథంగారు. "మళ్ళీ అదే మాట అంటావేం? నీ వల్ల జరిగిన తప్పేమీ లేదు. కాబట్టి అనవసరంగా బాధపడవద్దు. ఉద్యోగం అంటావా? ఒంట్లో ఇంకా ఓపిక వుంది గదా! ఈ ఓపికకూడా నశించి పూర్తిగా మూలపడితే, అప్పుడు నువ్వు ఉండనే వున్నావు! ఆ పరిస్థితిరానీ, అప్పుడు చూద్దాము."

తనకితెలుసు! ఇకపైన తన దగ్గరనించి ఒక్కపైసకూడ ముట్టుకోడు. తండ్రిని సంతోషపెట్టే అదృష్టం దొరికినా, తన చేతులారా తనే ఆ అదృష్టాన్ని కాలదన్నుకున్నాడు. ఈ బాధ తనని జీవితాంతం దావానలంలా వెంటాడుతూనే వుంటుంది. తనుచేసిన పనికి తనని నరికినా సంతోషించేవాడు. కాని తనవాళ్ళు చూపే ఈ ప్రేమానురాగాలు తట్టుకోలేడు.